దడ పుట్టిస్తున్న ప్రమాదాలు
సామాన్యుల బండిలో
రేగుతున్న అగ్గి
ఒడిశా ప్రమాదం
మరువక ముందే మళ్లీ కలకలం



గుండెల్లో

# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 4pm

గురువారం 6-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


# రైళ్లు..!




**సాఫీగా సాగే ప్రయాణానికి కేరాఫ్ రైలు.. ఫ్యామిలీ సభ్యులతో ఇంట్లో గడిపినట్లుగానే బోగీల్లో ముచ్చట్లు ఆడుకుంటూ.. చీకటి పడగానే హాయిగా నిద్రపోయి.. అలసట లేకుండా గమ్యానికి చేర్చే ఉత్తమ మార్గం. కానీ.. వరుస ఘటనలు ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. రైలులో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత నెలలో జరిగిన ఒడిశా రైలు యావత్ దేశాన్నే దిగ్భ్రాంతికి గురి చేసింది. వివిధ దేశాల్లోని వారు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పది.. వంద కాదు.. ఏకంగా మూడొందల మందికి పైగానే ఆ ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆ తర్వాత కూడా చిన్నచితకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా యాదాద్రి జిల్లాలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మంటల్లో చిక్కుకోవడం మరోసారి కలకలం రేపుతోంది.**

తెలుగుప్రభ, హైదరాబాద్

గత నెల 2 రాత్రి 7 గంటల సమయంలో ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బహనాగా బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన అత్యంత ఘోర రైలు ప్రమాదాన్ని మరువక ముందే శుక్రవారం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో రైలు ప్రమాదాలపై దుమారం రేగుతోంది. ఈ ఏడాది కేవలం ఏడు నెలల్లోనే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరగడం ఆలోచించదగ్గ విషయం. రైలు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిందేనని వరుస ప్రమాదాలు చాటి చెబుతున్నాయి.



## ఈ ఏడాదిలో జరిగిన కొన్ని ప్రమాదాలు

2 జనవరి 2023 : మార్వార్ జంక్షన్ రైల్వే స్టేషన్ నుండి తెల్లవారుజామున బయలుదేరిన సూర్యనాగ్రి ఎక్స్‌ప్రెస్ యొక్క 11 కోచ్‌లు పట్టాలు తప్పాయి. పది మంది గాయపడ్డారు.

15 మే 2023 : బెంగళూరు వైపు వెళ్తున్న చెన్నై-బెంగళూరు డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ యొక్క ఒక కోచ్ బిసానట్టం స్టేషన్ సమీపంలో ఉదయం 11:30 గంటలకు పట్టాలు తప్పింది.

2 జూన్ 2023 : ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో 128 కి.మీ/గం (80 mph ) వేగంతో నడుస్తున్న రైలు 12841 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఇనుప ఖనిజంతో కూడిన సరుకు రవాణా రైలు (గూడ్స్ రైలు)ని ఢీకొట్టింది . కోల్‌కతా సమీపంలోని షాలిమార్ రైల్వే స్టేషన్ నుండి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌కు రైలు వెళ్తుండగా బహనాగ బజార్ స్టేషన్ సమీపంలో ప్రమాదం జరిగింది . ఇరవైకి పైగా కోచ్‌లు పట్టాలు తప్పాయి. పట్టాలు తప్పిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు ఆ సెక్షన్‌ను పూర్తిగా దాటకముందే బెంగళూరు-హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ చివరి కొన్ని కోచ్‌లను ఢీకొన్నాయి. మొత్తం మూడు రైళ్లకు జరిగిన ప్రమాదంలో సుమారు 300 మంది మృతి చెందారు. 1,175 మంది గాయపడ్డారు.

8 జూన్ 2023 : ఊటీ నుండి మెట్టుపాళయం వెళ్లే 4-కోచ్ నీలగిరి మౌంటైన్ రైల్వే చివరి కోచ్ కూనూర్ స్టేషన్ సమీపంలో మధ్యాహ్నం 3 గంటలకు పట్టాలు తప్పింది. ఎటువంటి గాయాలు లేదా ప్రాణనష్టం సంభవించలేదు.

9 జూన్ 2023 : విజయవాడ-చెన్నై సెంట్రల్ జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్ నుండి తిరిగి షెడ్‌కి వెళుతున్న ఒక కోచ్ బేసిన్ బ్రిడ్జ్ స్టేషన్ సమీపంలో తెల్లవారుజామున 2:30 గంటలకు పట్టాలు తప్పింది.


11 జూన్ 2023 : చెన్నై సెంట్రల్ నుండి తిరువల్లూరు వైపు వెళ్తున్న చెన్నై సబర్బన్ లోకల్ రైలు చివరి కోచ్ బేసిన్ బ్రిడ్జ్ స్టేషన్ సమీపంలో ఉదయం పట్టాలు తప్పింది.

22 జూన్ 2023 : చెన్నై నుండి ముంబైకి వెళ్తున్న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లో హై-వోల్టేజ్ విద్యుత్ లైన్‌లో రాపిడి కారణంగా వ్యాసర్‌పాడి స్టేషన్ సమీపంలో మంటలు చెలరేగాయి.

7 జూలై 2023 : యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మాయిపల్లి -పగిడిపల్లి మధ్య ఫలక్‌నుమా సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయి. ఏడు బోగీలు దగ్ధం అయ్యాయి. ప్రయాణికులు భాయందోళనలకు గురయ్యారు.

## పొగలు గక్కుతున్న ఫలక్‌నుమా

శుక్రవారం జరిగిన ఫలక్‌నుమా ప్రమాదంలో ఏడు బోగీలు దగ్ధమయ్యాయి. మొత్తం 18 బోగీలకు గాను 11 బోగీలాను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తరలించారు. ఘటనాస్థలిలోని బోగీల నుంచి ఇంకా మంటలు చల్లారలేదు. ఘటనాస్థలికి చేరుకోవడానికి సరైన మార్గం లేకపోవడంతో ఫైరింజన్లు చేరుకోవడానికి కొంత సమయం పట్టింది. కలెక్టర్, రైల్వే, పోలీసు అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులను బస్సుల్లో వారి ప్రాంతాలకు తరలించారు.



### సిగరెట్టా.. షార్ట్ సర్క్యూటా..?

ఫలక్‌నుమా ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఓ ప్రయాణికుడు సిగరెట్ కాల్చి పడేయడం వల్లే మంటలు చెలరేగాయని ప్రయాణికుడు చెబుతున్నప్పటికీ, షార్ట్ సర్క్యూట్ కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రయాణికులను తరలించడంపైనే దృష్టి సారించామని, కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

### సామగ్రి బుగ్గి.. ప్రయాణికుల ఆవేదన

ప్రాణ నష్టం జరగపోయినప్పటికీ, ప్రమాదం జరిగిన ఏడు బోగీల్లోని కొందరు ప్రయాణికులకు చెందిన సామగ్రి కాలి బూడిదైంది. తన సర్టిఫికెట్లు అన్నీ మంటల్లో కాలిపోయాయని ఓ యువతి కన్నీరుమున్నీరైంది.

### రైళ్లు రద్దు

ఫలక్‌నుమా ప్రమాదంతో కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. రామన్నపేట రైల్వే స్టేషన్లో శబరి, నడికుడిలో రేపల్లె సికింద్రాబాద్ రైళ్లను నిలిపివేశారు. జన్మభూమి, నర్సాపూర్ రైళ్ల విజయవాడ మీదుగా మళ్ళించారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ట్రాక్ క్లియరెన్స్ కోసం మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టే అవకాశం ఉంది. కాగా, 11 బోగీలతో ఫలక్‌నుమా రైలు సికింద్రాబాద్ స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 1కు చేరుకుంది.

## చెప్పేదొకటి.. చేసేదొకటి

తెలుగుప్రభ,సంగారెడ్డి (జూలై7)

అందరికీ సువార్తలు బోధించే ఓ పాస్టర్.. తను మాత్రం మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అది గ్రహించిన అతని భార్య ఇద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు వెళ్లి వారి బండారాన్ని బట్టబయలుచేసింది. సంగారెడ్డిజిల్లా బొల్లారంలో ఉంటున్న జయరాజ్ అనే పాస్టర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భర్త వ్యవహారాన్ని గుర్తించిన ఆమె అతనికి తగిన గుణపాఠం చెప్పాలనుకుంది. తాను బురఖా ధరించి వెళ్లడమే కాక కొంతమందిని కూడా తనవెంట తీసుకువెళ్లి వారి వ్యవహారం వెలుగు చూసేలా చేసింది. అంతటితో ఆగలేదు. తన భర్తతోపాటు ఉన్న యువతిని ఈడ్చుకుంటూ కొట్టుకుంటూ వెళ్లింది. కొందరు ఈ దృశ్యాల్ని మొబైల్‌లో చిత్రీకరించడంతో ఇప్పుడవి వైరల్‌గా మారాయి



## డ్రైవర్ టూ ఓనర్

'దళితబంధు' విజయగాథ

తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 7)

వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి గ్రామానికి చెందిన రాగుల సాగర్, నేరెళ్ల శేఖర్‌లు గతంలో వేరేవారి దగ్గర డ్రైవర్లుగా పనిచేసేవారు. ఇద్దరూ కలిసి దళిత బంధు కింద ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయం రూ. 20 లక్షలు పొందారు. మరో రూ. 22 లక్షలు ఎస్‌బీఐ ద్వారా రుణం పొందారు. ఒక బస్సును కొన్నారు. ఆర్టీసీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సిరిసిల్ల, వరంగల్‌ల మధ్య నడుస్తున్న వారి బస్సు ప్రస్తుతం లాభాల బాటలో ఉంది. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా పంచుకుంటూ మునిసిపల్ మంత్రి కె.తారక రామారావు 'దళితబంధు' విజయగాథగా పేర్కొన్నారు.






## వార్డు ఆఫీసుల ద్వారా సమస్యల పరిష్కారం

తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై7)

'మీకు దగ్గరలోనే వార్డు ఆఫీసు ఉంది. ఏవైనా సమస్యలు ఉంటే అక్కడకు వెళ్లండి. అన్ని విభాగాల అధికారులు అక్కడ ఉంటారు. మీ సమస్యలు పరిష్కరిస్తారు'అన్నారు పశుసంవర్థక, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. నగరంలోని అమీర్‌పేట డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో పర్యటించిన మంత్రి.. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికుల నుద్దేశించి ప్రసంగించారు. ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారరం చూపాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అన్నారు. నగరంలో గత 60 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి ం బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేవలం 9 నెలల్లోనే జరిగిందన్నారు.

## డీకే అరుణ కుమార్తెకు ఝలక్!

ఆమె క్రెడిట్ కార్డు వాడుకున్న డ్రైవర్

ఏకంగా రూ. 11 లక్షలు



తెలుగు ప్రభ, హైదరాబాద్ (జూలై 7)

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కూతురు శ్రుతి రెడ్డిని ఆమె కారు డ్రైవర్ బురిడీ కొట్టించాడు. ప్రతీ రోజు ఆమెను రకరకాల ప్రాంతాలను, షాపింగ్ మాల్స్‌కు తీసుకెళ్లేవాడు.. ఓ రోజు మాత్రం తన కన్ను ఆమె క్రెడిట్ కార్డు మీద పడింది. వెంటనే ఆమె గమనించని సమయంలో మెల్లగా లేపేశాడు. ఆ కార్డుతో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 11 లక్షలు వాడుకున్నాడు. ఈ విషయాన్ని చాలా లేట్‌గా గమనించిన శ్రుతి రెడ్డి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14లోని ప్రేమ్‌పర్వత్ విల్లాస్‌లో శ్రుతి రెడ్డి నివసిస్తున్నారు. కాగా.. ఆమె దగ్గర చిన్నా అలియాస్ బీసన్న అనే వ్యక్తి.. కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చిన్నా గతేడాది డిసెంబర్‌లో పనిలో చేరగా.. శ్రుతి రెడ్డి ఎటూ వెళ్లినా తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలోనే.. శ్రుతి రెడ్డి వాడే క్రెడిట్ కార్డును చిన్నా తీసుకున్నాడు. శ్రుతి రెడ్డి తన కార్డును కారులోని వదిలేసి వెళ్తే తీసుకున్నాడా.. లేదా కావాలనే ఆమె దగ్గరి నుంచి కొట్టేశాడా అన్నది తెలీదు కానీ.. కార్డును మాత్రం తీసుకుకున్నాడు. శ్రీమహవీర్ జెమ్స్ అండ్ పెరల్స్‌లో ఆ కార్డును వాడుకుని రూ. 11 లక్షలు వాడుకున్నాడు. కాగా.. ఈ విషయాన్ని శ్రుతి రెడ్డి కాస్త ఆలస్యంగా గమనించింది. ఆ కార్డును తనకు తెలియకుండా ఎవరు వాడారని ఆరా తీయగా.. తన కారు డ్రైవర్‌పై అనుమానం వచ్చింది. విషయం తెలిసిన శ్రుతి రెడ్డి తన డ్రైవర్‌ను ఆరా తీశారు. కాగా.. శ్రుతి రెడ్డి అడిగిన ప్రశ్నలకు అడ్డదిడ్డంగా అబద్ధాలు చెప్పటమే కాకుండా.. పొంతనలేని కట్టు కథలు చెప్తూ కన్‌ఫ్యూజ్ చేయాలని చూశాడు. కానీ.. చివరకు శ్రుతి రెడ్డి క్రెడిట్ కార్డును తానే తీసుకుని.. డబ్బు వాడుకున్న విషయాన్ని ఒప్పుకున్నాడు. దీంతో.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు చిన్నాపై ఐపీసీ సెక్షన్ 420, 408ల కింద పోలీసులుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓవర్‌స్పీడ్‌తో ఢీకొట్టి ..

హైదరాబాద్, తెలుగుప్రభ(జూలై7):

నగరంలోని బంజారాహిల్స్‌లో శుక్రవారం తెల్లవారు జామున యాక్టివాపై వెళ్తున్న జీహెచ్ఎంసీ ఉద్యోగి జి.బాలచందర్‌ను అత్యంతా వేగంగా వెళ్తూ బీఎండబ్ల్యు కారు ఢీకొట్టింది. కారులో ఇద్దరు మహిళలున్నారని, వారు మద్యం మత్తులో ఓవర్‌స్పీడ్‌తో వెళ్తూ ఢీకొట్టినట్లు స్థానికులు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడ్డ బాలచందర్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.






## ఆర్టీసీ బస్సులో మంటలు

-డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 7) శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న టీఎస్ ఆర్టీసీకి చెందిన రాజధాని బస్సులో అగ్ని ప్రమాదం సంభవించింది. నగర శివారు పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బస్సులోని వారంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. బస్సు డ్రైవర్ అప్రమత్తతతో బస్సులోని ప్రయాణికులంతా కిందకు దిగారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహారించడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మొదట ఏసీలో మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాద సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. మంటల ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.